తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
18-04-2024
గురువారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 242 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889
జయభేరి



## ఘనంగా రాములోరి కళ్యాణం

- భద్రాచల క్షేత్రంలో నేత్రపర్వంగా సాగిన సీతారాముల కళ్యాణం

**జయభేరి, భద్రాచలం, ఏప్రిల్ 17:**

శ్రీరామ నవమి భద్రాచల క్షేత్రంలో బుధవారం సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా సాగింది. కల్యాణం సందర్భంగా సీతారామచంద్రస్వామి వారలకు ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం తెల్లవారు జామునే ఆలయ ద్వారాలను తెరిచి అర్చకులు.. రామయ్యకు సుప్రభాత సేవ జరిపారు. అనంతరం తిరువారాధన, ఆరగింపు, మంగళ శాసనం, అభిషేకం ఆ తర్వాత ధ్రువమూర్తులకు కల్యాణం నిర్వహించారు. తర్వాత కల్యాణ మూర్తులను పల్లకీలో ఉంచి మంగళవాయిద్యాల మధ్య మిథిలా మైదానంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేశారు.రజత సింహాసనం పై సీతారామచంద్ర స్వాములను ఆసీనులను చేశారు. తిరువారాధన, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి మండప శుద్ధి చేశారు. 'యుంజానహః ప్రథమం' అనే మంత్రాని పఠిస్తూ వేద పండితులు ప్రజా సంపత్సర్థం 'శ్రీయం ఉద్వాఃహిష్షే' అన్న సంకల్పంతో స్వామి వారికి ఎదురుగా సీతమ్మను కూర్చోబెట్టి కన్యావరణలు జరిపారు. మోక్షబంధం, ప్రతిసర బంధనం, ద్వితీయ సువర్ణ యజ్ఞోపవీత ధారణ గావించారు. వధూవరుల వంశ గోత్రాలకు సంబంధించి ప్రవరలు వినిపించారు.

...మిగతాది 2 లో



## అయోధ్యలో అద్భుత ఘట్టం

- బాల రాముడి నుదుటిపై సూర్యతిలకం

**జయభేరి, అయోధ్య, ఏప్రిల్ 17:**

అయోధ్య రామ మందిరంలో అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతమైంది. రామ నవమి సందర్భంగా బాల రాముడి నుదుటిపై సూర్యతిలకం దర్శనం ఇచ్చింది. సూర్య కిరణాలు మూలవిరాట్ని తాకేలా ట్రస్ట్ ఇలా ఏర్పాట్లు చేసింది. దాదాపు 34 నిముషాల పాటు ఈ తిలకం భక్తులకు కనువిందు చేసింది. అయోధ్య ఆలయ నిర్మాణం పూర్తైన తరవాత జరుగుతున్న తొలి శ్రీరామ నవమి వేడుకలు ఇవి. అందుకే అత్యంత వైభవంగా ఈ పండుగను జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసింది. నిజానికి వచ్చే ఏడాది శ్రీరామ నవమికి ఈ సూర్య తిలక దర్శనం ఉంటుందని చెప్పింది. కానీ...ఆ తరవాత ఈ ఏడాదే ఇది ఉంటుందని ప్రకటించింది. 58 మిల్లీ మీటర్ల పరిమాణంలో సూర్య కిరణాలు బాల రాముడి నుదుటిపై ప్రసరించాయి. ఆ సమయంలో ఆలయం అంతా జై శ్రీరామ్ నినాదాలతో మారు మోగింది.

## ఇవాళ్టి నుంచి నామినేషన్ల ప్రక్రియ




**జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 17:**

దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. మొత్తం 7 దశలలో దేశంలోని అన్ని లోక్సభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం పోలింగ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 16న సీఈసీ రాజీవ్ కుమార్ సార్వత్రిక ఎన్నికలు 2024 షెడ్యూల్ విడుదల చేయగా.. దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని విధాలుగా ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్ జరగనుంది.లోక్సభ ఎన్నికలకుగానూ ఇదివరకే మూడు దశల ఎన్నికల నోటిఫికేషన్లు విడుదల చేసింది ఈసీ.

...మిగతాది 2 లో

కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జి కిషన్ రెడ్ పోటీ చేస్తున్న సికింద్రాబాద్ నియోజకవర్గంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. సీనియర్ బీసీ నాయకుడైన మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ను చేర్చుకుని మరీ ఎంపీ టిక్కెట్ ఇచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఖైరతాబాద్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న దానం నాగేందర్ కు సొంత బలం, బలగం ఉంది.




## లష్కర్ లో రేవంత్ ప్లాన్ వర్కౌట్ అవుతుందా

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 17:**

గతంలో నాంపల్లి ఎమ్మెల్యేగా ముస్లిం వర్గాలతోనూ ఆయనకు మంచి సంబంధాలు ఉన్నాయి. మజ్లిస్ తోనూ రేవంత్ లోపాయికారీ ఒప్పందాలు పెట్టుకుంటున్నారు. అన్ని కాంబినేషన్లు సెట్ చేసుకుని కిషన్ రెడ్డిని ఓడించడానికి ప్రయత్నిస్తున్నారు. 2019 సార్వత్రిక ఎన్నికలలో సికింద్రాబాద్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీకి అత్యధికంగా 44.84 ఓట్లు వచ్చాయి. ఓటమి పాలైన తన సమీప బీఆర్ఎస్ అభ్యర్థి తలసాని సాయి కిరణ్ యాదవ్ కు 3,22,482 ఓట్లు అంటే 35.6 శాతం ఓట్లు దక్కాయి. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం అంజన్ కుమార్ యాదవ్ కు 1,73,027 ఓట్లు అంటే 19.1 శాతం ఓట్లు మాత్రమే దక్కడంతో మూడోస్థానంలో నిలిచారు. 2014 లోక్ సభ ఎన్నికల్లోనూ బీజేపీకి అత్యధికంగా 43.7 శాతం ఓట్లు వచ్చాయి. సికింద్రాబాద్ నుంచి రెండు సార్లు వరుసగా బీజేపీ గెలవగా, 2009 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ 39.4 శాతం ఓట్లతో విజయం సాధించింది. వరుస విజయాలతో సికింద్రాబాద్ నియోజకవర్గం కమలం పార్టీకి కంచుకోటగా మారింది.అసెంబ్లీ నియోజవర్గాల పునర్విభజన తర్వాత 2004, 2009 లోక్ సభ ఎన్నికల్లో అంజన్ కుమార్ యాదవ్ విజయం సాధించారు.నిజానికి 2004లో దానం నాగేందర్ కు ఆ టిక్కెట్ కు కాంగ్రెస్ కేటాయించింది. గెలిచే అవకాశమే లేదని

...మిగతాది 2 లో



## భారతదేశ జనాభా 144కోట్లు..!

- జనాభాలో 24 శాతం మంది 0-14 సంవత్సరాల మధ్య వయస్కులు
- 17శాతం మంది 10-19 సంవత్సరాల మధ్య వయస్కులున్నారు
- జనాభాలో 68 శాతం మంది 10-24 ఏళ్ల మధ్య వయస్కులు
- 7 శాతం మంది 65 ఏళ్లు పైబడిన వారు
- పురుషుల ఆయురార్ధం 71 సంవత్సరాలు
- మహిళల ఆయుర్దాయం 74 సంవత్సరాలు
- యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ నివేదిక..!

**జయభేరి, న్యూ డిల్లీ, ఏప్రిల్ 17:**

భారత దేశ జనాభా 144 కోట్లకు చేరిందని అంచనా. ఇందులో 24శాతం మంది 014 సంవత్సరాల వయసున్న ఉన్నారు. ఈ విషయాన్ని యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్ (UNFPA)

...మిగతాది 2 లో



## కనీసం మంచి నీరైనా ఇవ్వండి

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ `17:**

తెలంగాణలో తాగునీరు సమస్యగా మారిందని బీఆర్ఎస్ పార్టీ ఆరోపిస్తోంది. తాగునీటి కోసం పలు ప్రాంతాల్లో ప్రజలు అల్లాడిపోతున్నారని, దీంతో కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో తాగునీటి సమస్యపై మాజీ మంత్రి హరీష్‌రావు ఎమోషనల్ ట్వీట్ చేశారు. ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్కు హరీష్ రావు జత చేశారు. గుక్కెడు మంచి నీళ్ల కోసం ప్రజలు రొడ్డెక్కుతున్నారని పేర్కొన్నారు. ఖాళీ బిందెలతో ధర్నాలు చేస్తున్నారని, ట్యాంకర్ల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. గత కాంగ్రెస్ పాలనలోని నీటి కష్టాలు మళ్లీ మొదలయ్యాయని ఆరోపించారు. పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి దుస్థితి, దృశాలు ఎప్పుడూ కనిపించలేదన్నారు. మారుమూల తండాల్లోనూ మిషన్ భగీరథ జలధార సమృద్ధిగా వచ్చేదని, పంటలకు సాగునీళ్లు ఎలాగూ

...మిగతాది 2 లో



## రైతుల చుట్టూ రాజకీయం

**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 17:**

తెలంగాణలో జరుగుతున్న పార్లమెంట్ ఎన్నికల ఎజెండా విచిత్రంగా ఉంది. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎజెండా అంతా జాతీయ రాజకీయాలపైన నడుస్తోంది. మోదీ మరో మారు ప్రధాని అని బీజేపీ.. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేస్తారు లేదా మార్చేస్తారంటూ కాంగ్రెస్ విస్తృతంగా ప్రచారం చేపడుతోంది. ఆయా రాష్ట్రాల్లో కూడా ఎన్డీయే, ఇండియా కూటమి పార్టీలు జాతీయ రాజకీయ అంశాలే ప్రాధాన్య అంశాలుగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ పార్టీలను పక్కన పెడితే ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో కూడా వారి ఎజెండా జాతీయ అంశాల చుట్టు పరిభ్రమిస్తుంటే... తెలంగాణలో మాత్రం స్థానిక అంశాలనే ఎన్నికల బరిలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు ప్రధాన ఎజెండాగా ప్రచారం చేస్తున్నాయి. అందులోను రైతు సంబంధింత అంశాల చుట్టే అటు

...మిగతాది 2 లో

## నివేదిత కు డబుల్ బెడ్ రూమ్ సెగ



**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 17:**

బీఆర్ఎస్ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఒకవైపు కాళేశ్వరం, విద్యుత్ ఒప్పందాల్లో అక్రమాలు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం, లిక్కర్ స్కాంలో కవిత జైలుకు వెళ్లడం వంటివి ఆ పార్టీని ఇబ్బంది పెడుతున్నాయి. మరోవైపు గులాబీ పార్టీలో ఉండి పదేళ్లు వివిధ పదవులు అనుభవించిన వారు అధికార కాంగ్రెస్లో చేరుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలకు కూడా పార్టీ మారుతున్నారు. ఈ క్రమంలో పార్టీ అధినేత కేసీఆర్కు, ఆ పార్టీ కంటోన్మెంట్ అభ్యర్థి నివేదితకు డబుల్ సెగ తగిలింది. నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల ఇవ్వడం లేదని మొన్న కేసీఆర్ ఫామ్హౌస్ వద్ద ఇల్లు కేటాయించాలని ఆందోళన చేశారు. ఇక నిన్న నివేదిత ఇంటి వద్ద డబుల్ బెడ్రూం పేరుతో తమ నుంచి వసూరు చేసిన డబ్బులు ఇవ్వాలని బాధితులు ఆందోళనకు దిగారు. దీంతో నివేదిత

...మిగతాది 2 లో

## కవిత కోసం కాంప్రమైజ్ అయ్యారా.. కుమ్మక్కు రాజకీయాలు...


...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఘనంగా రాములోరి కళ్యాణం

అనంతరం ఆశీర్వచనం, పాద ప్రక్షాళన, పుష్పొదక స్నానం జరిపి వరపూజ కార్యక్రం జరిపారు. కల్యాణం సందర్భంగా సంప్రదాయబద్ధంగా భక్తరామదాసు చేయించిన పచ్చల పతకం, చింతాకు పతకం, కలికితురాయి, రామమాడ తదితర ఆభరణాలను రామయ్యకు, సీతమ్మకు, లక్ష్మణ స్వామికి ధరింపజేశారు. అర్చక స్వాములు స్వామి వారికి నూతన వస్త్రాలను అలంకరించారు. అభిజిత్ లగ్నం సమయంలో సీతారాముల ఉత్సవమూర్తుల శిరసుపై జీలకర్రబెల్లం ఉంచి.. అనంతరం భక్తరామదాసు చేయించిన మంగళ సూత్రాలతో సూత్రధారణ, తలంబ్రాల కార్యక్రమం నిర్వహించారు. కల్యాణ వేడుకలో వేలాది మంది భక్తులు వీక్షించి పరవశించి పోయారు. కల్యాణం జరిగిన మిథిలా మైదానంతో ఆలయ పరిసరాలన్నీ రామనామస్మరణతో మార్మోగాయి. కల్యాణోత్సవంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహా, హైకోర్ట్ జడ్జి భీమపాక నగేష్రామయ్య కల్యాణాన్ని వీక్షించారు. కల్యాణ వేడుక సందర్భంగా మిథిలా స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం నాడు శ్రీరాముడి పట్టాభిషేక కార్యక్రమం జరగనుంది. అలాగే, రాములోరి కళ్యాణ వేడుకలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ పాల్గొన్నారు. ఎలాంటి ప్రొటోకాల్ లేకుండా.. సామాన్య భక్తుల్లా రాములోరి కళ్యాణాన్ని తిలకించారు.

## లష్కర్ లో రేవంత్ ప్లాన్..



ఆయన టీడీపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. చివరి క్షణంలో నగర కాంగ్రెస్అధ్యక్షుడిగా ఉన్న అంజన్ కుమార్ యాదవ్ తో నామినేషన్ వేయించారు. అనూహ్యంగా ఆయన గెలిచారు. తర్వాత కూడా ఆయన గెలిచారు. గత రెండు ఎన్నికల్లో ఓట్ల చీలిక వల్ల ప్రధానంగా బీజేపీ లాభపడింది. బీజేపీకి సాలిడ్ ఓటు బ్యాంక్ ఉండగా.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఇతర ఓట్లు చీలిపోవడం ద్వారా కిషన్ రెడ్డికి ఇబ్బంది లేకుండా పోయింది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ముస్లిం మైనారిటీ, బీసీ, ఎస్సీ,ఎస్టీ ఓట్లే కీలకం. ముస్లిం మైనారిటీలు సాధారణంగా మజ్లిస్ ఓటు బ్యాంక్. అయితే ఇప్పుడు మజ్లిస్ తో కాంగ్రెస్ సన్నిహిత సంబంధాలు కలిగి ఉంది. సికింద్రాబాద్ లో పోటీ పెట్టే అవకాశాలు కనిపించడం లేదు. పోటీ లేకపోతే ముస్లిం వర్గాలు కాంగ్రెస్ కు ఏకపక్షంగా మద్దతు పలుకుతాయి. యోజకవర్గంలో 5లక్షల మందికి పైగా ముస్లిం మైనారిటీ ఓటర్లే ఉన్నారు. గతంలో మజ్లిస్ బీఆర్ఎస్ కు సపోర్ట్ చేసేది. ఈ సారి కాంగ్రెస్ కే మజ్లిస్ సపోర్ట్ లభించనుంది. కీలకమైన సీ,ఎస్టీ, బీసీల ఓట్లను పొందడం ద్వారా విజయం సాధించాలని హస్తం నేతలు వ్యూహాలు రూపొందిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ కు ముస్లిం వర్గంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. దానం నాగేందర్ పోటీ చేయడం వల్ల బీసీ ఓట్లు సమైక్యం అవుతాయని అనుకుంటున్నారు. ఈ కీలకమైన రెండు వర్గాల ఓట్లు గంపగుత్తగా కాంగ్రెస్ అభ్యర్థికి పడితే ఆ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ విజయం సులువు అవుతుందని రేవంత్ రెడ్డి నమ్ముతున్నారు. సికింద్రాబాద్ లోక్సభ ఎన్నికల్లో వెనుకబడిన తరగతుల ఓట్లు నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నాయి. కులాల సర్వే నిర్వహించి సామాజిక వర్గాలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్గాంధీ హామీ ఇచ్చారు. దీంతో కాంగ్రెస్ పార్టీ బీసీల ఓట్లపై ఆశలు పెట్టుకుంది. మున్నూరు కాపు సామాజికవర్గం, కల్లుగీత కార్మికులు, పద్మశాలి వర్గం, ఇతర బీసీ సంఘాలకు చెందిన ఓటర్లు సికింద్రాబాద్ లో 3 లక్షల మంది ఉన్నారని, వారంతా తమ వెంట ఉన్నారని దానం నాగేందర్ నమ్మకంగా ఉన్నారు. త్రిముఖ పోటీ అంటూ జరిగితే బీజేపీ సులువుగా బయటపడుతుంది. కానీ ముఖాముఖి పోరు జరిగితే బీజేపీకి ఇబ్బందికరమే. సీనియర్ నేత పద్మారావును బీఆర్ఎస్ అభ్యర్థిగా నిలబెట్టింది. ఎవరూ ముందుకు రాకపోవడం వల్ల ఆయనను నిలబెట్టారన్న ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ప్రచారం ఇంకా ఊపందుకోలేదు. అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత బీఆర్ఎస్ తరపున సీరియస్ గా పని చేయడానికి ఎమ్మెల్యేలు కూడా రెడీగా లేరు. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ పోరు ముఖాముఖిగా మారి.. పద్మారావు చేతులెత్తేశారన్న అభిప్రాయం వినపిస్తే కాంగ్రెస్ అవకాశాలు పెరుగుతాయి. కేంద్రమంత్రి అయిన కిషన్ రెడ్డి ఐదేళ్లలో నియోజకవర్గానికి తక్కువ సమయమే కేటాయించారు. కానీ ఆయన అన్ని పార్టీల నేతలతోనూ సాఫ్ట్ గానే ఉంటారు. శత్రువులుగా ఎవరూ భావించరు. మళ్లీ బీజేపీ గెలుస్తుందని.. కిషన్ రెడ్డి ఖచ్చితంగా కేంద్ర మంత్రి అవుతారని నియోజకవర్గ ప్రజలు భావిస్తూ ఉంటారు. అది కిషన్ రెడ్డికి ప్లస్ అయ్యే అవకాశం ఉంది. ఆయన కుటుంబసభ్యులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటారు. అయితే సొంత నియోజకవర్గం అంబర్ పేటలోనూ అసెంబ్లీ ఎన్నికల్లో పట్టు కోల్పోవడం ఆయనకు ఇబ్బందికరమే. కిషన్ రెడ్డి గతంలో ఎన్నడూ లేనంత గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారని చెప్పవచ్చు.

## నామినేషన్ల ప్రక్రియ

నేడు (ఏప్రిల్ 18న) నాలుగో దశ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలకు ఏర్పాట్లు చేస్తోంది ఈసీ. నాల్గవ దశలో 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్ (25 స్థానాలు), తెలంగాణ (17), బిహార్ (5), ఝార్ఖండ్ (4), మధ్యప్రదేశ్ (8), మహారాష్ట్ర (11), ఒడిశా (4), ఉత్తర్ ప్రదేశ్ (13), పశ్చిమ బెంగాల్ (8), జమ్మూకాశ్మీర్ (1). గురువారం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఎన్నికలకు ఎన్నికల నోటిఫికేషన్ జారీ కానుంది. అదే రోజు నుంచి అంటే 18 నుంచే అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఏప్రిల్ 25 వరకూ నామినేషన్లు దాఖలుకు గడువు ఇచ్చారు. ఈ 26న నామినేషన్ల పరిశీలన చేపడతారు. చివరికి ఈ29న నామినేషన్ల ఉప సంహరణతో ఈ ప్రక్రియ పూర్తి అవుతుంది. నాలుగో దశలో ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణలలో మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలతో పాటు లోక్ సభ స్థానాలకు, తెలంగాణలో లోక్సభ ఎన్నికలతో పాటు ఖాళీ అయిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానానికి ఇదే దశలో పోలింగ్ నిర్వహించనున్నారు. జూన్ 4 న ఓట్లు లెక్కించి, విజేతల్ని ప్రకటించనుంది ఈసీ.

**గురువారం ఏపీ, తెలంగాణ ఎన్నికల నోటిఫికేషన్**

ఎన్నికల నోటిఫికేషన్ జారీ ఏప్రిల్ 18
నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం ఏప్రిల్ 18
నామినేషన్లు దాఖలుకు తుది గడువు ఏప్రిల్ 25
నామినేషన్ల పరిశీలన ఏప్రిల్ 26
నామినేషన్ల ఉప సంహరణ ఏప్రిల్ 29
ఏపీ, తెలంగాణలో ఎన్నికలు మే 13
ఓట్ల లెక్కింపు, విజేతల ప్రకటన జూన్ 4

ఫేజ్ 1 ఎన్నికలు ఏప్రిల్ 19న 21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 102 లోక్ సభ స్థానాలకు పోలింగ్

2వ దశ ఎన్నికలు ఏప్రిల్ 26న నిర్వహించనున్నారు. అభ్యర్థుల నామినేషన్ల గడువు ఏప్రిల్ 4తో ముగిసింది. రెండవ దశలో 12 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 89 స్థానాల్లో ఎన్నికలు.

ఫేజ్ 3 ఎన్నికలు మే 7న పోలింగ్.. కాగా, అభ్యర్థుల నామినేషన్ల గడువు ఏప్రిల్ 19తో ముగియనుంది. మూడో దశలో భాగంగా 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 94 లోక్ సభ స్థానాలకు పోలింగ్


4వ దశ ఎన్నికలు మే 13న ఓటింగ్ జరగనుండగా.. అభ్యర్థుల నామినేషన్ల తుది గడువు ఏప్రిల్ 25తో ముగియనుంది. నాల్గవ దశలో 10 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు

5వ దశ ఎన్నికలు మే 20న ఈసీ పోలింగ్ నిర్వహించనుంది. మే 3 వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. ఐదవ దశలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 49 లోక్సభ స్థానాలకు పోలింగ్

6వ దశ ఎన్నికలు మే 25న ఎన్నికలు ఉండగా.. మే 6తో అభ్యర్థుల నామినేషన్ల గడువు ముగియనుంది. ఆరవ దశలో 7 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 57 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు ఉంటాయి.

7వ దశ ఎన్నికలు జూన్ 1న పోలింగ్ జరగాల్సి ఉండగా.. అభ్యర్థుల నామినేషన్ల గడువు మే 14తో ముగియనుంది. ఏడవ దశలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి 57 లోక్ సభ స్థానాలకు పోలింగ్.

# కవిత కోసం కాంప్రమైజ్ అయ్యారా..
# కుమ్మక్కు రాజకీయాలు...






✍ **జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 17 :**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత బీఆర్ఎస్ తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ పరిస్థితి తయారైంది. ఎన్నికల ఫలితాలు వచ్చిన పది రోజుల్లోనే కేసీఆర్ ఫామ్హౌస్లో జారిపడ్డారు. తుంటి ఎముక విరగడంతో దాదాపు మూడు నెలలు బయటకు రాలేదు. కేసీఆర్ కోలుకునే నాటికే బీఆర్ఎస్లోని కీలక నేతలు కాంగ్రెస్లోకి టచ్లోకి వెళ్లారు. ఆయన బయటకు వచ్చాక ముగ్గురు సిట్టింగ్ ఎమ్మెల్యేలు అధికార పార్టీలో చేరారు. కీలక సీనియర్ నాయకులు కూడా బీఆర్ఎస్కు గుడ్బై చెప్పారు. వలసలు కొనసాగుతుండగానే కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవిత అరెస్ట్ అయ్యారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈడీ మార్చి 15న కవితను అరెస్ట్ చేసింది. పది రోజుల కస్టడీ తర్వాత తిహార్ జైలుకు తరలించింది. ఏప్రిల్ 10 సీబీఐ అరెస్ట్ చేసింది. సీబీఐ కూడా 3 రోజులు కస్టడీలోకి తీసుకుని విచారణ చేసింది. తర్వాత తిహార్ జైలుకు తరలించింది కవిత అరెస్ట్ అయి నెల రోజులైనా.. ఆమె తండ్రి, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్రావు ఈ అరెస్ట్ను ఖండించలేదు. ఇక కవిత నెల రోజులుగా తిహార్ జైల్లో ఉంటున్నా ఆమెను కలవడానికి వెళ్లడం లేదు. కేటీఆర్, హరీశ్రావు మాత్రమే కవిత అరెస్ట్ను ఖండించారు. ఢిల్లీ వెళ్లి మరీ కలిసి వచ్చారు. కవిత తల్లి కూడా ఒకసారి పరామర్శించారు. కేసీఆర్ మాత్రం వ్యూహాత్మక మౌనం వహిస్తున్నారు.ఇక కవితను కాపాడుకునేందుకు కేసీఆర్ మోదీతో కుమ్మక్కయ్యారా? అందులో భాగంగానే లోక్సభ ఎన్నికల్లో బీజేపీకి సహకరించబోతున్నారా? ఈమేరకు ఒప్పందం కుదిరిందా..? కాంగ్రెస్ సర్కార్ను కూల్చేందుకు బీజేపీతో కలిసి కుట్రలు చేస్తాన్నారా? అంటే అవుననే అంటున్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి. నారాయణ పేటలో నిర్వహించిన జన జాతర సభలో కేసీఆర్పై సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. జైలుపాలైన కూతురును కాపాడుకునేందుకు బీజేపీతో జతకట్టారని ఆరోపించారు. బిడ్డ కోసం ప్రధాని నుంచి సుపారీ తీసుకున్నారని తెలిపారు.ఇక ఈ క్రమంలోనే సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఐదు లోక్సభ స్థానాల్లో బీజేపీని గెలిపించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈమేరు చేవెళ్ల, మల్కాజ్గిరి, జహీరాబాద్, మహబూబ్నగర్, భువనగిరి లోక్సభ స్థానాల్లో డమ్మీ అభ్యర్థులను పోటీకి పెట్టారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను పడగొట్టేందుకు కేసీఆర్ , నరేంద్ర మోదీ ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. ఇక లోక్సభ ఎన్నికల తర్వాత తెలంగాణలో రేవంత్ సర్కార్ పడిపోతుందని బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్రావు పేర్కొంటున్నారు. బీజేఎల్పీ నేత మహేశ్వర్రెడ్డి కూడా లోక్సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్లోని ఏక్నాథ్షిండేలు ఆ పార్టీని చీలుస్తారని ఆరోపించారు. ఇద్దరు ముగ్గురు షిండేలు ఉన్నారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్రెడ్డి టార్గెట్గా ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు.మరోవైపు బీఆర్ఎస్ నేతలు రేవంత్రెడ్డీ బీజేపీతో కుమ్మక్కయ్యాడని ఆరోపిస్తున్నారు. లోక్సభ ఎన్నికల తర్వాత సీఎం రేవంత్రెడ్డి 30 మంది ఎమ్మెల్యేలను తీసుకుని బీజేపీలో చేరతారని ఆరోపిస్తున్నారు. తాను ఎన్నిసార్లు ఈ ఆరోపణ చేసిన రేవంత్ మౌనం వహించడమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. ఈ క్రమంలోనే మల్కాజ్గిరి, సికింద్రాబాద్ స్థానాల్లో డమ్మీ అభ్యర్థులను పోటీకి దించి బీజేపీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ అభ్యర్థుల ఎంపికలో జాప్యం వెనుక కూడా బీజేపీ ఉందని ఆరోపిస్తున్నారు.మొత్తంగా తెలంగాణలో కుమ్మకు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాజకీంయ వేడెక్కుతోంది. ఒకవైపు ఎన్నికల ప్రచారం, మరోవైపు కుమ్మకు ఆరోపణు చర్చనీయాంశమవుతున్నాయి.

## డబుల్ బెడ్ రూమ్ సెగ

నివాసం వద్ద ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్కు చెందిన నేతలు, సాయన్న అనుచరులుగా ముద్ర పడిన వారే డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం ఆందోళన చేయడం సంచలనంగా మారింది.నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని పేరుత దివంగగత ఎమ్మెల్యేలు సాయన్న, ఆయన కుమార్తె లాస్య నందిత, ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థిథ నివేదిత నియోజకవర్గంలోని ప్రజల నుంచి రూ.1.46 కోట్లు వసూలుచేసినట్లు బీఆర్ఎస్ లీడర్ సదానంద్గౌడ్ తెలిపారు. నియోజకవరలోని 30 మంది నుంచి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు తీసుకున్నారని ఆరోపించారు. ఇండ్ల కోసం ఒత్తిడి చేయగా గతేడాది రూ.12 లక్షలు తిరిగి ఇచ్చారని తెలిపారు. మిగతా రూ.1.34 కోట్లు ఇవ్వాలని ఇంటి చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వసూలు చేసిన డబ్బులు ఇవ్వకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఇదిలా ఉండగా బీఆర్ఎస్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో భారీగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అర్హులైన ప్రతీ పేదవాడికి పైరవీలు లేకుండా డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పిన మాజీ సీఎం కేసీఆర్ మాటలకు.. క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఘటనలకు చాలా తేడా ఉంది. నాటి అధికార పార్టీ నేతలే ఇళ్ల పంపిణీ కోసం అక్రమ వసూళ్లకు పాల్పడ్డారు. ఈ క్రమంలో దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత వసూళ్ల దందాకు చెందిన ఆడియో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వైరల్గా మారింది. ఆ ఆడియో.. దివంగత ఎమ్మెల్యే లాస్య నందితది అని తేలింది. డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కోసం ఓ వ్యక్తి నుంచి రూ.5 లక్షలు డబ్బులు తీసుకున్నట్టు ఈ ఆడియో ద్వారా తెలిసింది. ఇళ్లు ఇవ్వకపోగా.. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో ఈ వివాదం జరిగింది.ఇక వైరల్ అయిన వీడియోలో లాస్య నందిత తన తండ్రి సాయన్న పదవిని అడ్డు పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఉంది. లాస్య నందిత రూ.5 లక్షలు తీసుకున్నట్లు వీడియోలో అంగీకరించింది. అయితే డబుల్ బెడ్ రూమ్ ఇంటిని ఇప్పించలేనందున వడ్డీ రూ.3 లక్షలు కలిపి రూ.8 లక్షలు ఇవ్వాలని బాధితుడు లాస్యనందితను డిమాండ్ చేయడం వీడియోలో ఉంది. వడ్డీ ఎలా ఇస్తానని లాస్య అతనితో వాదించింది. ఇదిలా ఉండగా తాజాగా సాయన్న రెండో కుమార్తె నివేదిత కూడా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో డబ్బులు వసూలు చేసినట్లు పలువురు ఆరోపించడం సంచలనంగా మారింది.

## భారతదేశ జనాభా 144కోట్లు..!

నివేదిక పేర్కొంది. అయితే, 2011లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభా 121 కోట్లు. అయితే, ప్రసవ సమయంలో శిశు మరణాలు తగ్గుముఖం పట్టాయని నివేదిక వెల్లడించింది. భారతదేశ జనాభాలో 24 శాతం మంది 014 సంవత్సరాల మధ్య వయస్కులు కాగా.. 17శాతం మంది 1019 సంవత్సరాల మధ్య వయస్కులున్నారు. జనాభాలో 68 శాతం మంది 1024 ఏళ్ల మధ్య వయస్కులు కాగా, 7 శాతం మంది 65 ఏళ్లు పైబడిన వారు ఉన్నారు.పురుషుల ఆయురార్ధం 71 సంవత్సరాలు కాగా.. మహిళల ఆయుర్దాయం 74 సంవత్సరాలు. 2006 నుంచి 2023 మధ్య భారత్లో బాల్య వివాహాల శాతం 23శాతంగా ఉందని పేర్కొంది. ఇక దేశంలో డెలివరీ సమయంలో మరణాలు తగ్గుముఖం పట్టాయి. పీఎల్ఓఎస్ గ్లోబల్ పబ్లిక్ హెల్త్ నివేదికను ఉదహరిస్తూ.. 640 జిల్లాల్లో ప్రసవానంతర మరణాల నిష్పత్తి లక్ష జననాల్లో 70 కంటే తక్కువగా ఉంది. 114 జిల్లాల్లో ఈ నిష్పత్తి 210 కంటే ఎక్కువగా ఉంది. వికలాంగులు, శరణార్థులు, జాతి మైనారిటీలు, క్వీర్ కమ్యూనిటీలు, హెచ్ఐవీతో బాధితులతో పాటు అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలు, బాలికలు అత్యధిక లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కొంటున్నారని వేదిక పేర్కొంది.చదువుకునే, పని ప్రదేశాల్లో కుల వివక్షను ఎదుర్కొంటున్న మహిళలకు చట్టపరమైన రక్షణ కల్పించాలని భారతదేశంలోని దళిత ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నట్లుగా నివేదిక పేర్కొంది. కొన్ని కుటుంబాలు పూర్తిగా నిరుపేదలుగా మిగిలిపోతాయని.. తమ కుటుంబాలను పోషించలేరని.. వారి పిల్లలను పేదరికం నుంచి బయటకు తీసుకురాలేరు. ఇది పేలవమైన లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యాన్ని ప్రోత్సహించే చక్రానికి దోహదం చేస్తుంది. దాదాపు సగం మంది దళిత మహిళలకు ప్రసవానంతర సంరక్షణ అందడం లేదు. ప్రతిరోజూ 800 మందికిపైగా మహిళలు ప్రసవ సమయంలో మరణిస్తున్నారని నివేదిక తెలిపింది. నాలుగో వంతు మంది మహిళలు తమ భాగస్వామితో శృంగారాన్ని నిరాకరించలేకపోతున్నారు. ప్రతి పది మంది మహిళల్లో ఒకరు సొంత నిర్ణయాలు తీసుకోలేకపోతున్నట్లుగా నివేదిక పేర్కొంది.

## మంచి నీరైనా ఇవ్వండి

ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ప్రజలకు గొంతు తడుపుకోడానికి మంచినీళ్ళయినా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్రంలోని ప్రధాన మూడు జలాశయాలైన శ్రీరాంసాగర్, ఎల్లంపల్లి, నాగార్జున సాగర్లలో గతేడాది తరహాలోనే ఈ ఏడాదీ సరిపడా నీటి లభ్యత ఉన్నందున ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేవని రాష్ట్ర ప్రభుత్వం ఇంతకు ముందే ప్రకటించింది. రాష్ట్రంలో తాగునీటి సమస్య తలెత్తకుండా 'వేసవి కార్యాచరణ ప్రణాళిక'ను రూపొందించి జిల్లాలకు తగు నిధులను కూడా విడుదల చేసినట్లు తెలిపింది. తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని ఇప్పటికే బోరు బావుల ఫ్లషింగ్, పైపుల మరమ్మతులు పూర్తి చేయడం జరిగిందని ఇటీవల ప్రభుత్వం తెలిపింది. నిరంతర నీటి సరఫరా కొనసాగింపునకు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్లను చీఫ్ సెక్రటరీ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజూ గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాపై సంబంధిత క్షేత్ర స్థాయి అధికారులు, నోడల్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించాలని ఆదేశించారు. అయితే కొన్ని చోట్ల తాగునీటి సమస్యలు ఉన్నాయని మీడియాలో వస్తున్నాయి. వాటి ఆధారంగా విపక్షాలు విమర్శలు చేస్తున్నాయి.



## రైతుల చుట్టూ రాజకీయం

అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తిరగడం విశేషంగా చెప్పాలి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేతిలో పరాభవం పొందిన బీఆర్ఎస్ తిరిగి తన బలం పెంచుకునే దిశగా మరో సారి అన్నదాతలనే నమ్ముకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ లోనే ఎక్కువ స్థానాలు గెల్చుకున్న గులాబీ పార్టీని రూరల్ తెలంగాణలోని ఫలితాలు పెద్ద దెబ్బతీసాయి. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ,వరంగల్, కరీంనగర్, మహబూబ్ నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో పెద్దఎత్తున సీట్లు గెల్చుకుని మరో దఫా అధికారం చేపడతామని భావించిన బీఆర్ఎస్ కు ఆ జిల్లాల్లో ఘోర పరాభవం మిగిలింది. మెదక్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలే కారు పార్టీ పరువు కాపాడాయి. దీంతో రూరల్ తెలంగాణపై దృష్టి సారించిన గులాబీ దళపతి కేసీఆర్ రైతు ఎజెండాను మరో సారి పైకి తీసారు. ఈ క్రమంలోనే పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావు రూరల్ తెలంగాణలో విస్తృతంగా ప్రర్యటించారు. రైతుల పొలం బాట పట్టి ఎండిన పంటలను పరిశీలించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సాగు నీరు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. మరో వైపు కేసీఆర్ సైతం నల్గొండ, వరంగల్ జిల్లాల్లో ప్రత్యేకంగా రైతుల కోసం పర్యటన చేపట్టారు. ఎండిపోయిన పంటలను పరిశీలించి ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు . 2 లక్షల రైతు రుణ మాఫీ పై రేవంత్ ప్రభుత్వాన్నినిలదీసారు. 200 మంది రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ జవాబుదారీ అంటూ నిప్పులు చెరిగారు. రైతు బంధు కింద 15 వేల రూపాయల ఆర్థిక సాయం , ఎండిన పంలకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇలా రైతు సంబంధిత అంశాలను ఎప్పటికప్పుడు ప్రస్తావిస్తూ.. కాంగ్రెస్ , బీజేపీ ప్రభుత్వాలను టార్గెట్ చేస్తూ గులాబీ పార్టీ ఎన్నికల రాజకీయాల్లో సాగుతోంది.

వికసిత్ భారత్ కోసం మూడో సారి ప్రధానిగా మోదీని గెలిపించాలని దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రచారం చేస్తోంది. అయితే తెలంగాణలో మాత్రం బీజేపీ రైతు అంశాల పైనే ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్లను లక్ష్యాంగా చేసుకుని విమర్శలు గుప్పిస్తోంది. కరీంనగర్ లో ఎంపీ బండి సంజయ్ ఇటీవలే ఒక రోజు రైతు దీక్ష చేపట్టారు. హైదరాబాద్ లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి దీక్ష నిర్వహించారు. రైతులకు సాగు నీరు ఇవ్వడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎకరాకు 25 వేల నష్ట పరిహారం చెల్లించాలని, అన్ని పంటలకు రూ. 500 బోనస్ ఇవ్వాలని ఈ దీక్ష ద్వారా బీజేపీ డిమాండ్ చేసింది. రైతు భరోసా కింద 15వేల ఆర్థిక సాయం చేయాలని, రైతు కూలీలకు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేస్తూ కమలం నేతలు దీక్షలు చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు కూడా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ను రైతు సమస్యలపై నిలదీయడం ద్వారా ఈ ఎన్నికల్లో లబ్ధి పొందే ప్లాన్ ను అమలు చేస్తున్నాయి.దేశ మంతటా I.N.D.I.A కూటమని గెలిపించాలని, రాహుల్ ను ప్రధాని చేయాలని కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం చేస్తోంది. బీజేపీకి ఓటు వేస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారని ప్రచారం చేస్తోంది. అయితే తెలంగాణ కాంగ్రెస్ నేతలు మాత్రం బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు లెవనెత్తుతోన్న రైతు హామీలపైనే దృష్టి పెట్టి కౌంటర్ చర్యలు చేపట్టింది. రైతులకు నీరు ఇవ్వడం లేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ప్రతిపక్షాలు విమర్శిస్తుంటే, తాము అధికారంలోకి వచ్చి మూడు నెలలే అవుతుందని, బీఆర్ఎస్ పాలనలోనే ఈ పరిస్థితులు నెలకొన్నాయని కాంగ్రెస్ కౌంటర్ ప్రచారం మొదలు పెట్టింది. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు కూడా 2 లక్షల రైతు రుణ మాఫీ హామీ పై కాంగ్రెస్ ను ఇరుకున పెట్టే ప్రయత్నం చేశారు. నిన్న నారాయణ పేటలో జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు హామీల్లోని రెండు రైతు హామీలను అమలు తేదీని ప్రకటించారు.

ఆగష్టు 15వ తేదీ లోపు రాష్ట్రంలోని అర్హులైన 69 లక్షల రైతులకు 2 లక్షల రుణ మాఫీ చేస్తామని ప్రకటించారు. వచ్చే సీజన్ నుండి ధాన్యానికి 500 రూపాయలు క్వింటాకు బోనస్ గా చెల్లించనున్నట్లు స్పష్టం చేశారు.ఇప్పటి వరకు బీఆర్ఎస్, బీజేపీలు రైతు రుణ మాఫీ విషయంలో కాంగ్రెస్ పై విమర్శలు ఎక్కుపెడుతుండటంతో సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్ గా ఆగష్టు 15 లోపు మాఫీ ఉంటుందని చెప్పి ప్రతిపక్షాల నోరు మూసే ప్రయత్నం చేశారు. అయితే రానున్న రోజుల్లో సాగు నీరు విషయంలోను ప్రతిపక్షాలు అధికార కాంగ్రెస్ ను ఇబ్బంది పెట్టే అవకాశాలున్నాయి. పంటలు ఎండిపోవడం కాంగ్రెస్ పార్టీకి కొంత ఇబ్బంది కలిగించే పరిణామం అనే చెప్పాలి. అయితే ఎన్నికలు దగ్గవుతున్న కొద్ది రైతుల అంశమే ప్రధాన ఎన్నికల ప్రచారంశం అవుతుందా.. లేక జాతీయ అంశాలు తెరపైకి వస్తాయా అన్నది మాత్రం వేచిచూడాలి. అంతే కాకుండా ఈ మూడు పార్టీల్లో రైతు ఓటు బ్యాంకు కొల్లగొట్టే పార్టీ ఏదా అన్నది కూడా వేచి చూడాల్సిన విషయమే.

# దేవరాయాంజాల్ లో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

- సీతారాముల కళ్యాణం లో పాల్గొన్న మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి
- శ్రీరాముని దీవెనలతో అందరూ సంతోషం గా ఉండాలి - సునీత మహేందర్ రెడ్డి

**జయభేరి, ఏప్రిల్ 17:**

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపల్ పరిధిలోని దేవర యాంజాల్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవానికి మల్కాజ్ గిరి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి తోటకూర వజ్రేశ్ యాదవ్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, శామీర్ పేట్ మండల ఎన్నికల ఇంచార్జ్ నక్క ప్రభాకర్ గౌడ్ లు హాజరై సీతారాములను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ సిబ్బంది వారికి తీర్థ ప్రసాదాలు అందచేశారు. సీతారాముల కృపతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.





ఈ కార్యక్రమంలో ఉమ్మడి శామీర్ పేట్ మండల మాజీ జెడ్పీటిసి బాలేష్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, అల్వాల్ సొసైటీ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోతాయిపల్లి మాజీ ఉప సర్పంచ్ రాజు, మున్సిపల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మురళి గౌడ్, రాము, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, మున్సిపల్ కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షులు ధర్మారెడ్డి, రామాలయం మాజీ ధర్మకర్త భారతమ్మ, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శేశాంత్, మున్సిపల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రమేష్, మున్సిపల్ యన్ యస్ యు ఐ అధ్యక్షులు సాయి మనీష్, ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాబు, బిక్షపతి, గౌతమ్ గౌడ్, మహేందర్, కాంగ్రెస్ నాయకులు ప్రదీప్, రవీందర్ గౌడ్, దుర్గయ్య, సాయిలు, పాండు, సాయి, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయి కృష్ణ, వెంకటేశ్, శ్రీకాంత్ రెడ్డి, కిషోర్, రోహిత్ రెడ్డి, యన్ యస్ యు ఐ నాయకులు హర్షవర్ధన్ రెడ్డి, భరత్ గౌడ్, సాయి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## ఉప్పల్లో ఘనంగా శ్రీరామనవమి మహోత్సవాలు

**జయభేరి, ఉప్పల్ :**

శ్రీరామనవమి సందర్భంగా ఉప్పల్ క్రాస్ రోడ్ వద్ద గల శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవాలయంలో శ్రీకాంత్ శర్మ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఉప్పల్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ బండారి లక్ష్మారెడ్డితో పాటు హాజరై స్వామి వారి ఆశీర్వచనాలు అందుకొని తీర్థప్రసాదాలు తీసుకోవడం జరిగింది. ఉప్పల్ హిల్స్ : నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న బి ఆర్ఎస్ సీనియర్ నాయకులు మేకల మధుసూదన్ రెడ్డి. గణేష్ నగర్ : గణేష్ నగర్ అసోసియేషన్ కొండ్రు హనుమంతరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్, ఆకుల మహేందర్, జట్ట కిషోర్, చింతల నరసింహారెడ్డి, సుర్వి శ్రీనివాస్ రెడ్డి, భాష పల్లి నిరంజన్, శేఖర్, బూత్కూరి రాము, నరేంద్ర చౌదరి, రామ్ రెడ్డి, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కల్యాణమహోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. శ్రీరామనవమి సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని డివిజన్లు కాప్రా, AS రావు నగర్, చర్లపల్లి, మల్లాపూర్, నాచారం, చిలుక నగర్, రామాంతపూర్, హబ్సిగుడా, ఉప్పల్ డివిషన్లలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమం లో AS Rao Nagar డివిజన్ మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయి జేన్ శేకర్, చిలుకా నగర్ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్, రామాంతపూర్ మాజీ కార్పొరేటర్ గంధం జోత్స్నా నాగేశ్వరావు, మహేష్ గౌడ్, నవీన్ గౌడ్ మహిపాల్ రెడ్డి, జంపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**జయభేరి, ఉప్పల్**



## బాటసారులు దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం




**జయభేరి, కాప్రా :**

సొలిస్ హాస్పిటల్ ఆధ్వర్యములో ఏర్పాటు చేసిన చలివేంద్రం ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి. రాధిక X రోడ్, ఇసిఎల్ X రోడ్ దగ్గర స్వర్గీయ వెంకయ్య తులిశమ్మ జ్ఞాపకార్థం, వారి కుమారులు వీరాంజనేయులు & బ్రదర్స్ కుటుంబసభ్యయులు ఏర్పాటుచేసిన చలివేంద్రం ను ఎమ్మెల్యే ప్రారంబించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నదని నిత్యం పరిసర ప్రాంతాలనుంచి నుంచి వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయని పేర్కొన్నారు. చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని, బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ప్రతిఒక్కరూ చలివెంద్రల ఏర్పాటు కి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



శ్రీరామ నవమి సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలిని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం లో మాజీ మంత్రివర్యులు, మేడ్చల్ శాసన సభ్యులు చామకూర మల్లారెడ్డి, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని స్వాముల వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించి స్వామివారి ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం భారతీ సీమెంట్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం వితరణ కార్యక్రమం పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**



## ఇది ప్రయాణమా.. ప్రమాదమా...

**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలో ఆటోలో ప్రయాణం ప్రమాకరంగా మారింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలు పరిమితికి మించి ఆటోల్లో నిల్చొని ప్రయాణం చేస్తున్నారు. ఆటో నిర్వాహకులు నిబంధనలు పట్టించుకోకుండా సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకొని ప్రమాదానికి కారకులు అవుతున్నారు. ఆటో స్థాయికి మించి ప్రయాణికులు ఎక్కడంతో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. త్వరగా గమ్యం చేరాలనే లక్ష్యంతో డ్రైవర్లు అతివేగంగా ప్రయాణిస్తూ బోల్తా కొట్టిస్తున్నారు. ఆటోల్లో అధికలోడ్తో ప్రయాణిస్తున్న ఆటోలను అధికారులు నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా దేవేందర్ నగర్ లో రాములోరి కళ్యాణం

- వేదమంత్రోచ్ఛరణలతో మార్మోగిన కాలనీ...
- పులకించిన భక్తులు.. అనందడోళికలో డివిజన్ వాసులు...
- అన్నదాన కార్యక్రమం
- కళ్యాణంలో పాల్గొన్న కార్పోరేటర్లు, కమిటీ, కాలనీవాసులు





**జయభేరి, మేడిపల్లి, ఏప్రిల్ 17 :**


మేళ తాళాలు, వేదమంత్రోచ్ఛరణలు, భక్తుల కోలాహలం, ఆధ్యాత్మిక శోభ నడుమ బుధవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ దేవేందర్ నగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయ ఆవరణలో శ్రీ శ్రీ శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం లోక కళ్యాణార్థమై అంగరంగ వైభవోపేతంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో స్థానిక కార్పోరేటర్లు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, దానగళ్ళ అనితా యాదగిరి దంపతులు, కాలనీ కమిటీ పాల్గొన్నారు. సీతారాముల కళ్యాణ వేడుకతో దేవేందర్ నగర్ పులకరించిపోయింది. భారీగా తరలివచ్చిన భక్తుల సాక్షిగా అర్చకులు జయజయ ద్వనాల మధ్య జగదబిరాముడి కళ్యాణ మహోత్సవం వైభవంగా జరిపించారు. ఈ సంధర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణ, అంజనేయ విగ్రహాల దాత శ్రీనివాస్ గుప్తా దంపతులను కమిటి సన్మానించింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు..ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వాసూరి ఉప్పలయ్య, కాలనీ అధ్యక్షుడు దుప్పెల్లి భగవంత్, ప్రధాన కార్యదర్శి మరాటి మల్లేష్, కోశాధికారి దయ్యాల మహేష్, ఉపాధ్యక్షులు జోగు సుధాకర్, కాటం స్వామి, బెల్లపూరి మధు, జన్నే దర్మయ్య, బొడగళ్ల సదానంద్, దేవరాజు, మైల నర్సింహ్మా, వాసూరి యాదగిరి, దండు రమేష్, రాంపాక ఉప్పలయ్య, శంకర్, వాసూరి రాము, ఓరుగంటి బాస్కర్, మాల్ల అనిల్, అంబాల అరవింద్, చెవ్వెల్లి అశోక్, కాలనీవాసులు పెద్ద ఎత్తున్న పాల్గోన్నారు..

## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం

- ఆ సీతారాముల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి : ఎమ్మెల్యే బండారి

**జయభేరి, ఉప్పల్ :**

చిల్కానగర్ డివిజన్లోని సీతారామ కాలనీలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటుచేసిన సీతారాములవారి కళ్యాణ మహోత్సవాల్లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి, చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొనడం జరిగింది. సీతారామ కాలనీలో ఏర్పాటుచేసిన కళ్యాణ మహోత్సవంలో పాల్గొని ఆ సీతారామ స్వామి ఆశీస్సులు పొందడం జరిగింది. కార్యక్రమంలో ఉప్పల్ మాజీ వైస్ చైర్మన్ గౌరిగే కృష్ణ, మహంకాళి లక్ష్మణ్, రావుల బాలకృష్ణ, కాలనీ అధ్యక్షుడు గూడూరు రమేష్, టెంపుల్ చైర్మన్ మెండు శ్రీనివాస్ రెడ్డి, బోరంపేట రమేష్, ఉప్పల్ మాజీ కౌన్సిలర్ పల్లె రాజ్ కుమార్ గౌడ్, సాయిలు, వెంకటేష్, రాజమౌళి, శ్రీనివాసు, జంగయ్య, గణేష్, తదితరులు పాల్గొన్నారు.





## లోక్ సభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం


- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలించిన : అడిషనల్ డిసిపి వెంకట్ రెడ్డి
- పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించాలి : ఏసీపీ రాములు

**జయభేరి, ఏప్రిల్ 17:**

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని మేడ్చల్ అడిషనల్ డీసీపీ వెంకట్ రెడ్డి అన్నారు. లోక్ సభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభం కానుండడంతో మేడ్చల్ మల్కాజ్ గిరి కలెక్టరేట్ పరిధిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను ఆయన పరిశీలించారు. ఇక నామినేషన్ కోసం వచ్చే అభ్యర్థులు, ర్యాలీల నిర్వహణ పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎన్నికల నిబంధనల మేరకు ర్యాలీలు, ప్రచార కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పేట్ బషిరాబాద్ ఏసీపీ రాములు, శామీర్ పేట్ సిఐ సానా శ్రీనాథ్, ట్రాఫిక్ సిఐ హనుమ గౌడ్, ఎస్ఐ లు చంద్రశేఖర్, అనిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## లాల్ గడి మలక్ పేట్ లో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

- అంగరంగ వైభవంగా జరిగిన సీతారాముల కళ్యాణం..
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

జయభేరి, ఏప్రిల్ 17 :

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో శ్రీరామ నవమి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించడానికి గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం ఆలయ సిబ్బంది అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఈ శ్రీరామ నవమి వేడుకలను అట్టహాసంగా నిర్వహిస్తామని సిబ్బంది వెల్లడించారు. ఊరంతా కలిసి ఈ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని గ్రామస్తులు తెలిపారు ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి,నరసింహారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, చీదు శ్రీనివాస్ రెడ్డి, ఆల రాజిరెడ్డి, మామిండ్ల అశోక్, నల్లపాడు, కొరివి కృష్ణ, దశరథ, చాట్లపల్లి నర్సింగరావు, చందా రాజనర్సింహ గుప్తా,గ్రామస్తులు పాల్గొన్నారు.

## జోరుగా బీజేపీ ప్రచారం




జయభేరి, మేడ్చల్ :

నరేంద్రమోదీ పాలనలో భారతదేశం అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతుందని మేడ్చల్ బిజేపి అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిదిలోని 4,5,15 వార్డులో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ కు మద్దతుగా మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ప్రజలను కలిసి నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధిని వివరిస్తూ ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సందర్భంగా అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఎక్కడికి వెళ్ళినా బిజేపి కి ప్రజకు నీరాజనం పడుతున్నారని మల్కాజిగిరి పార్లమెంట్ లో బిజేపి అభ్యర్థి ఈటల గెలుపు ఖాయమని అన్నారు. యువత ప్రతి ఒక్కరు నరేంద్ర మోడీ కి ఓటు వేస్తాము వేరే వాళ్ళతో కూడా వేయిస్తామని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. ప్రచారంలో మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ అమర మోహన్ రెడ్డి కౌన్సిలర్ (సెన్సార్ బోర్డ్ మెంబర్) అమరం సరస్వతి రామ్ చందర్ బీజేవైఎం అధికార ప్రతినిధి కావేరి శ్రీధర్ బీజేవైఎం మున్సిపల్ జనరల్ సెక్రెటరీ సీనియర్ నాయకులు సారా కిషన్ కృష్ణ సురేష్ ఆంజనేయులు యాదగిరి మహిళా మోర్చా ప్రెసిడెంట్ నవనీత జి ఎస్ భారతి పద్మ శోభారాణి లక్ష్మి తదితర బిజెపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## మోది తోనే అభివృద్ధి



జయభేరి, దేవరకొండ :

నల్లగొండ పార్లమెంట్ బిజెపి అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి గెలుపుకు తూర్పుపల్లిలో భాజపా నాయకులు ప్రచారంలో ముమ్మరం చేశారు. నరేంద్ర మోడీ ని (మూడవసారి) ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా దేవరకొండ మండలం నంబర్ 57 & 58లో పార్టీ నాయకులు ప్రచారాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించి అమూల్యమైన ఓటు భారతీయ జనతా పార్టీ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి నలగొండ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డిని గెలుపుకు సహకరించాలని కోరారు. కార్యక్రమం లో జనతా పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహ బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు కుంభం తిరుపతి గౌడ్ బూత్ అధ్యక్షుడు అంకురి గౌతమ్ తిరుపతి,మావిళ్ళ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణం మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే



జయభేరి, దేవరకొండ :

శ్రీరాముని ఆశీస్సులు మనందరిపై ఎల్లవేళలా ఉండాలని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు.బుధవారం శ్రీ రామ నవమి సందర్భంగా దేవరకొండ పట్టణంలోని కోదండ రామాలయంలో కళ్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వసంత రుతువులో చైత్ర శుద్ధ నవమి రోజున ప్రతిఏటా వైభవోపేతంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించుకుంటారని అన్నారు. దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని లోక కళ్యాణం కోసం ఎన్నోత్యాగాలను కోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనదని,రాబోయే తరాలకు ఆదర్శనీయమైనదని తెలిపారు. సీతారాముల ఆశీస్సులు ప్రజలకు ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించేలా దీవించాలని సీతారామచంద్రమూర్తులను ప్రార్థించనున్నట్టు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గాజుల ఆంజనేయులు, చిలువేరు చంద్రమౌళి, గాజుల రాజేష్,బొడ్డుపల్లి కృష్ణ,ఎన్ ఎన్ చారి, ఆలయ కోశాధికారి వనపర్తి మురళి తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణం కమనీయం

- గుండ్లపోచంపల్లి కన్నుల పండుగగా సీతారాముల కల్యాణం..
- రామనామస్మరణతో మార్మోగిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం..

జయభేరి, మేడ్చల్ :

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి ఆలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. నూతన వధూవరులైన శ్రీ సీతారాములను విశేష అలంకరణలతో ఆలయ మండపంలోని కళ్యాణ వేదికపై ఆశీనుల్ని చేశారు.మామిడి తోరణాలు, విశేష పుష్పాలంకరణలు, మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణంలో మున్సిపాలిటీ చుట్టుపక్కల నుండి అధిక సంఖ్యలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవికాలం అవడంతో కల్యాణానికి విచ్చేసిన భక్తులకు కులర్లు ఏర్పాటు చేసి చల్లదనానికి నీళ్లు అందజేశారు. ఉదయం ఎదుర్కోళ్లతో మొదలైన వేడుకలు ముత్యాల తలంబ్రాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తుల మద్య సీతారాములు కళ్యాణం నల్థిగా అనువంశిక అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామనామ స్మరణలతో ఆలయం మార్మోగింది. కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కళ్యాణ మహోత్సవంలో మేడ్చల్ ఎమ్మెల్యే మాజీ మంత్రి మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్, నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా డిసిసి అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.






# వైభవంగా సీతారాముల కళ్యాణం మహోత్సవం

జయభేరి, హైదరాబాద్ :

హస్తినాపురం క్రిస్టియన్ కాలనీలో 40 ఫీట్ రోడ్డు నందు శ్రీరాముని కళ్యాణ మహోత్సవ కార్యక్రమము మధ్యాహ్నం 12 గంటలకు సుముహూర్తమున మంగళసూత్ర ధారణ పురోహితులు కళ్యాణ మహోత్సవం నిర్వహించినారు కార్యక్రమములో వరుని (శ్రీరాములవారి) పక్షాన L. ఇంద్ర శేఖరరెడ్డి, శ్రీమతి సంధ్య, వధువు (సీతమ్మ తల్లి) పక్షాన అర్థం సతీష్ కుమార్ శ్రీమతి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించినారు కార్యక్రమం. అనంతరం వచ్చిన భక్తులందరికీ మహాప్రసాదం ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డి హరిందర్ రెడ్డి, కార్యదర్శి అన్నుప్రభాకర్ రెడ్డి, కోశాధికారి కోట కృష్ణయ్య, సొసైటీ మెంబర్స్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.











## అంగ వైకల్యాన్ని జయించి.. సివిల్స్ సాధించి..

జయభేరి, హైదరాబాద్:

ఐఏఎస్ కావడమే తన జీవిత లక్ష్యమని అంగవైకల్యాన్ని జయించి 887 సివిల్స్ ర్యాంకర్ సాధించిన హనితను అనలాగ్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విన్నకోట శ్రీకాంత్ శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను పదో తరగతి వరకు వైజాగ్లో చదివానని, ఇంటర్మీడియట్ ప్రిడ్జి లో, 2012లో జేఈ రాసి ఐఐటిలో చేరారని తెలిపారు. అయితే తాను రెండో సెమిస్టర్ చేస్తున్న సమయంలో పెరాలిసస్ స్ట్రోక్ వచ్చి తన రెండు కాళ్లు పడిపోయాయని దీంతో తాను సంవత్సరం మధ్యలో ఐఐటిని వదిలేసి నిరాశ చెందకుండా డిగ్రీ పూర్తి, సివిల్స్ ప్రిపేర్ అయ్యానని తెలిపారు. నాలుగోసారి ఈ ర్యాంకును సాధించడం జరిగిందన్నారు. తాను ఈ ర్యాంకు సాధించడానికి అనలాగ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఇచ్చిన గైడెన్స్ ఎంతగానో దోహదపడిందని, ఆయన మార్గ దర్శకంలో రాబోయే రోజుల్లో ఐఏఎస్ సాధిస్తానని నమ్మకం ఉందని అన్నారు. అనంతరం చిన్నకోట శ్రీకాంత్ మాట్లాడుతూ, 2023 సంవత్సరం యుపీఎస్సీ ఫలితాల్లో 11, 16, 47, 50 ర్యాంకులతో పాటు వందలోపు వందర్యాంకులు వచ్చాయని తెలిపారు. తమ సంస్థలో కోచింగ్ తీసుకున్న విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించడం ఎంతో గౌరవంగా ఉందని తెలిపారు.

## శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో సీతారాముల కళ్యాణం



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఈరోజు కన్నుల పండగ గా సీతారాముల కళ్యాణ మహోత్సవం ఆలయ కమిటీ వారు నిర్వహించినారు. అభిషేకాలు ఎదుర్కోలు శ్రీ సీతారాముల కళ్యాణం నాగవల్లి బంతులాట హారతి మంత్రపుష్పం ఆలయ ప్రధానార్చకులు ఘంటసాల సుబ్రహ్మణ్య శర్మ మరియు వారి శిష్య బృందం ఆధ్వర్యంలో నిర్వహించినారు. కళ్యాణ మహోత్సవంకు వచ్చిన భక్తులందరికీ దేవరకొండ వాసవి క్లబ్ మరియు వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ ఏర్పాటు చేసినారు అనంతరం వచ్చిన భక్తులందరికీ ఆలయ కమిటీ వారు మహా ప్రసాదం ఏర్పాటు చేసినారు.

కళ్యాణం చేసిన దంపతులు బెజవాడ నరేందర్ నీరజ, నేలంటి కృష్ణయ్య శోభారాణి, కొత్త శోభ నాదీశ్వర్ శ్రావణి, మంచి కంటి రమేష్ పద్మ, సముద్రాల సహదేవ్ విజయలక్ష్మి, గోవిందు కొండయ్య శైలజ, కుంచకూరి శ్రీను శిరీష, గోవిందు జగతయ్య పద్మ గార్లు కళ్యాణం మీద కూర్చున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవ అధ్యక్షులు పానుగంటి మల్లయ్య అధ్యక్షులు చీదెళ్ళ వెంకటేశ్వర్లు కార్యదర్శి సముద్రాల ప్రభాకర్ కోశాధికారి కొత్త సుబ్బారావు వాసవి కళ్యాణ మండపం అధ్యక్షులు వాస వెంకటేశ్వర్లు కార్యదర్శి గుద్దేటి జంగయ్య కోశాధికారి సముద్రాల ఆనంద్ ఆలయ కమిటీ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న కేటీఆర్

జయభేరి, హైదరాబాద్:

శ్రీరామనవమి సందర్భంగా కూకట్పల్లిలోని పురాతన శ్రీ సీతా రామచంద్రస్వామి దేవాలయంలో, సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు., ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంబీపూరి రాజు లు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. కేటీఆర్ శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయంలో వేద పండితుల ఆశీస్సులు తీసుకున్నారు. అట్టహాసంగా నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకలలో వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసున్నారు.

## వెంచర్ లో మహిళ మృతదేహం

జయభేరి, మేడ్చల్:

మేడ్చల్ పోలీసు స్టేషన్ పరిధిలో మహిళా అనుమానస్పద మృతి చెందింది. ఓ వెంచర్ లో మహిళా మృతదేహాన్ని గమనించిన స్థానికులు, పోలీసుల కు సమా చారంతో ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు,క్లూస్ టీం, పూర్తిగా కుళ్లిపోయిన మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు.




భారీ స్కోర్లు నమోదవుతున్న ఐపీఎల్17లో తొలిసారిగా ఓ జట్టు 100 పరుగులలోపే చిత్తైంది. అహ్మదాబాద్‌లో మ్యాచ్ అంటే ప్రత్యర్థి ఎవరన్నదీ చూడకుండా వీరబాదుడు బాదే గుజరాత్ టైటాన్స్‌కు ఢిల్లీ క్యాపిటల్స్ ఊహించని షాకిచ్చింది. తమ బౌలింగ్‌తో చుక్కలు చూపించి టైటాన్స్‌ను 89 పరుగులకే కట్టడిచేసింది. వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ, ముకేశ్ కుమార్‌లు పేస్‌తో గుజరాత్‌ను వణికించగా వికెట్ల వెనుక పంత్ అద్భుత వికెట్ కీపింగ్ నైపుణ్యంతో ఆకట్టుకోవడంతో గిల్ సేన ఈ లీగ్‌లో తొలిసారిగా వందపరుగుల కంటే తక్కువ స్కోరుకు పరిమితమైంది. స్వల్ప ఛేదనను ఢిల్లీ 8.5 ఓవర్లలోనే ఊదేసింది. ఈ విజయంతో పాయింట్ల పట్టికలో ఆ జట్టు 9వ స్థానం నుంచి ఏకంగా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని ఆరో స్థానానికి రావడం విశేషం. గుజరాత్ నాలుగో ఓటమితో ఏడో స్థానానికి పడిపోయింది.

# ఢిల్లీ చేతిలో గిల్‌గిల..

## లక్నోను వారి సొంత ఇలాఖాలో చిత్తుచేసిన పంత్ సేన

## 89 పరుగులకే టైటాన్స్ ఆలౌట్

## రాణించిన ఢిల్లీ పేసర్లు... క్యాపిటల్స్ ఏకపక్ష విజయం

✍ **జయభేరి, అహ్మదాబాద్:**

ఐపీఎల్ 17లో పడుతూ లేస్తూ వస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ వరుసగా రెండో విజయం కొట్టింది. ఇటీవలే లక్నోను వారి సొంత ఇలాఖాలో చిత్తుచేసిన రిషభ్ పంత్ సేన.. తాజాగా అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌కు అవమానకరమైన ఓటమిని రుచిచూపించింది. ఢిల్లీ బౌలర్ల విజృంభణతో నరేంద్ర మోడీ స్టేడియం వేదికగా ఏకపక్షంగా జరిగిన మ్యాచ్‌లో గుజరాత్.. 17.3 ఓవర్లలో 89 పరుగులకే పరిమితమైంది. రషీద్ ఖాన్ (24 బంతుల్లో 31, 2 ఫోర్లు, 1 సిక్సర్) ఆ జట్టులో టాప్ స్కోరర్ కాగా ఏకంగా 8 మంది సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో ముకేశ్ (3/14), ఇషాంత్ శర్మ (2/8)లు అద్భుతంగా బౌలింగ్ చేశారు. స్వల్ప ఛేదనను ఢిల్లీ 8.5 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. జేక్ ఫ్రేజర్ (10 బంతుల్లో 20, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) మెరుపులు మెరిపించాడు. అద్భుతమైన వికెట్ కీపింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ రాణించిన రిషభ్ పంత్ (11 బంతుల్లో 16 నాటౌట్, 1 ఫోర్, 1 సిక్స్)కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన గుజరాత్‌కు ఆరంభం నుంచే కష్టాలు చుట్టుముట్టాయి. ఇన్నింగ్స్ రెండో ఓవర్లోనే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (6) ఇషాంత్ శర్మ బౌలింగ్‌లో కవర్స్ వద్ద పృథ్వీ షాకు క్యాచ్ ఇచ్చాడు. అహ్మదాబాద్‌లో ఆడిన 16 ఐపీఎల్‌లో ఇన్నింగ్స్‌లో సింగిల్ డిజిట్‌కు ఔట్ అవడం అతడికి ఇది మూడోసారి మత్రమే. నాలుగో ఓవర్‌లో ముకేశ్.. వృద్ధిమాన్ సాహా (2)ను క్లీన్‌బౌల్డ్ చేసి మరో దెబ్బకొట్టాడు. ఐదో ఓవర్లో గుజరాత్‌కు డబుల్ షాకులు తాకాయి. గిల్ స్థానంలో వచ్చిన సాయి సుదర్శన్.. రెండు ఫోర్లు కొట్టినా ఐదో ఓవర్లో మొదటి బంతికే దురదృష్టవశాత్తూ రనౌట్ అవగా గుజరాత్ భారీ ఆశలు పెట్టుకున్న డేవిడ్ మిల్లర్ (2) రిషభ్ పంత్‌కు క్యాచ్ ఇవ్వడంతో ఆ జట్టు నాలుగో వికెట్ కోల్పోయింది. పవర్ ప్లే ముగిసేసరికి ఆ జట్టు స్కోరు 304.

నత్తకు నడక నేర్పినట్టు సాగిన గుజరాత్ ఇన్నింగ్స్‌ను ట్రిస్టన్ స్టబ్స్ 9వ ఓవర్లో కోలుకోనీయకుండా చేశాడు. ఆ ఓవర్లో అభినవ్ మనోహర్ (8)తో పాటు షారుక్ ఖాన్ (0)ను పంత్ సూపర్ స్టంపింగ్‌తో పెవిలియన్‌కు పంపాడు. రాహుల్ తెవాటియా (10)ను అక్షర్ పటేల్ వికెట్ల ముందు బలిగొన్నాడు. గుజరాత్ తరఫున 17వ ఓవర్లో తొలి సిక్సర్ కొట్టిన ఆ జట్టు టాప్ స్కోరర్ రషీద్ ఖాన్‌ను మరుసటి ఓవర్లో ముకేశ్ ఔట్ చేశాడు. నూర్ అహ్మద్‌ను బౌల్డ్ చేసిన ముకేశ్ గుజరాత్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

స్వల్ప లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఢిల్లీ కూడా తడబడినా వేగంగా మ్యాచ్‌ను పూర్తిచేసింది. పృథ్వీ షా (7) విఫలమైనా గత మ్యాచ్‌లో అర్ధ సెంచరీతో రాణించిన ఆసీస్ కుర్రాడు జేక్ ఫ్రేసర్.. ధాటిగా ఆడాడు. పది బంతుల్లోనే రెండు ఫోర్లు, రెండు సిక్సర్లతో 20 పరుగులు చేశాడు. స్పెన్సర్ జాన్సన్ అతడిని ఔట్ చేశాడు. అభిషేక్ పొరెల్ (7 బంతుల్లో 15, 2 ఫోర్లు, 1 సిక్సర్)ను సందీప్ వారియర్ బౌల్డ్ చేయగా.. రెండు సిక్సర్లు కొట్టిన షై హోప్ కూడా రషీద్ ఖాన్ బౌలింగ్‌లో మోహిత్ శర్మకు క్యాచ్ ఇచ్చాడు. అయితే రిషభ్ పంత్, సుమిత్ కుమార్ ఢిల్లీ మరో వికెట్ కోల్పోకుండా మ్యాచ్‌ను ముగించారు.

రోడ్డు ప్రమాదంలో చావు అంచుల వరకూ వెళ్లి సుమారు ఏడాదిన్నర పాటు ఆటకు దూరమైన రిషభ్ పంత్ ఈ సీజన్‌లో రీఎంట్రీ ఇచ్చి బ్యాట్‌తో దుమ్మురేపుతున్నా గుజరాత్‌తో మ్యాచ్‌లో మాత్రం అతడి వికెట్ కీపింగ్.. మునుపటి పంత్‌ను గుర్తుకుతెచ్చింది. గుజరాత్ బ్యాటర్లలో నలుగురిని పెవిలియన్‌కు పంపడంలో అతడు కీలకపాత్ర పోషించాడు. మిల్లర్ క్యాచ్‌ను పంత్ ఎడమవైపు డైవ్ చేస్తూ ఒంటిచేత్తో అద్భుతంగా అందుకున్నాడు. స్టబ్స్ వేసిన 9వ ఓవర్లో అయితే రెప్పపాటు వ్యవధిలోనే రెండు అదిరిపోయే స్టంపౌట్స్‌తో గుజరాత్‌ను దెబ్బకొట్టాడు. అభినవ్ మనోహర్, షారుక్ ఖాన్‌ల స్టంపౌట్స్ ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. రీఎంట్రీ తర్వాత పంత్ ఎలా రాణిస్తాడన్నదానిపై అనుమానాలు తొలగిపోయినా గుజరాత్‌తో మ్యాచ్‌లో అతడి వికెట్ కీపింగ్ విన్యాసాలు ప్రేక్షకులను అలరించాయి. పంత్ ఇదే పట్టుదలతో ఆడితే రాబోయే టీ20 ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కడం ఖాయమే!

ఆడుతున్న గుజరాత్ జెయింట్స్ వంద లోపు ఆలౌట్ అవడం ఇదే తొలిసారి. ఆ జట్టుకు ఈ లీగ్‌లో ఇదే అత్యల్ప స్కోరు. అంతకుముందు కూడా ఢిల్లీపై 125 పరుగులకు పరిమితమైంది.

**సంక్షిప్త స్కోర్లు**

గుజరాత్ : 17.3 ఓవర్లలో 89 (రషీద్ ఖాన్ 31, సాయి 12, ముకేశ్ 3/14, ఇషాంత్ 2/8), ఢిల్లీ : 8.5 ఓవర్లలో 92/4 (జేక్ ఫ్రేజర్ 20, షై హోప్ 19, సందీప్ 2/40, రషీద్ 1/12)



# వేసవిలో జాగ్రత్త

## కుక్కలు కరిచే కాలం ఇదే..

▸▸ కుక్క కరిచిన వెంటనే ఇలా చేయండి

వేసవిలో కుక్క కాటుకు బలయ్యే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. కుక్క కరిచిన వెంటనే ఏం చేయాలో తెలుసుకోండి. అది ప్రాణాంతకం కాకుండా కాపాడుకోండి.

వేసవి వస్తే అంతా జాగ్రత్తగా ఉండాలి. రోడ్లపై తిరిగే కుక్కలే కాదు, ఇంట్లోని పెంపుడు కుక్కలు కూడా ఒక్కోసారి అకారణంగా కరుస్తూ ఉంటాయి. కుక్కలు అకస్మాత్తుగా మనుషుల మీద దాడి చేసే సంఘటనలు వేసవిలోనే ఎక్కువగా కనిపిస్తూ ఉంటాయి. ఎండాకాలంలో కుక్కలు ఇలా విపరీతంగా ప్రవర్తించడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. అవి అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోలేక తీవ్ర కోపానికి, ఉద్రేకానికి గురవుతాయి. వాటి శరీర ఉష్ణోగ్రత పెరిగిపోవడం, రోగ నిరోధక వ్యవస్థ పై కూడా ప్రభావం పడడం వల్ల వీటి స్వభావం మారిపోతుంది. ఎండలోనుంచి వచ్చిన వ్యక్తి ఎంతగా చికాకు పడతాడో... అవి కూడా అంతే కోపంగా, చికాకుగా ఉంటాయి. దీని వల్లే అవి దూకుడుగా ప్రవర్తిస్తాయి. ఆహారం, నీళ్లు అందక మరింత ఉద్రేకంగా ఉంటాయి. ముఖ్యంగా డీహైడ్రేషన్‌కు గురైన కుక్క ఎవరినైనా కరిచే అవకాశాలు చాలా ఎక్కువ. కాబట్టి వేసవిలో కుక్క కాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలి.


కుక్క కరిస్తే చాలామంది తేలికగా తీసుకుంటారు. నిజానికి కుక్క కాటుకు గురైన వెంటనే తక్షణం టీకా తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే రేబిస్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు రావచ్చు.ఈ వ్యాధికి ఎటువంటి నివారణ లేదు. ఇది ప్రాణాంతక పరిస్థితులకు తీసుకెళ్తుంది. కాబట్టి కుక్క కాటు వల్ల పెద్ద గాయం అయినా లేదా చిన్న గాయమైన ఖచ్చితంగా టీకా అవసరం.

**కుక్క కరిచిన వెంటనే ఏం చేయాలి?**

కుక్క కరిచిన వెంటనే సబ్బుతో ఆ గాయాన్ని శుభ్రంగా కడగాలి. చాలామంది గాయాలకు పసుపు పెట్టి ఊరుకుంటారు. అక్కడ మురికి, బ్యాక్టీరియా చేరి సమస్య పెరిగిపోతుంది. కాబట్టి వెంటనే సబ్బుతో గాయాన్ని కడగాలి. ఆల్కహాల్ వంటివి పోసే వారి సంఖ్య ఎక్కువే. అలాంటి పనులు చేయకూడదు. కుక్క కాటు వల్ల రక్తస్రావం అధికంగా ఉంటే శుభ్రమైన వస్త్రంతో కట్టుకట్టి రక్తం అధికంగా పోకుండా కాపాడుకోవాలి. వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలి. టెటానిస్ ఇంజక్షన్ తీసుకోవడం చాలా ముఖ్యం.

కుక్క కరిచిన తరువాత రాబిస్ వ్యాక్సిన్ ఐదుసార్లు తీసుకోవాల్సి ఉంటుంది. కుక్క కరిచిన మొదటి రోజు, మూడవ రోజు, ఏడవ రోజు, 14వ రోజు, 31వరోజు... ఈ రాబిస్ వ్యాక్సిన్ ను తీసుకోవాలి. అన్ని ప్రభుత్వ కేంద్రాలలో ఇవి అందుబాటులో ఉంటాయి.

కుక్కకాటును తేలికగా మాత్రం తీసుకోవద్దు. చిన్న పంటిగాటు పడినా కూడా తగిన చికిత్స తీసుకోవడం అవసరం. కుక్క కాటు కారణంగా మరణిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. కాబట్టి వేసవిలో కుక్కకాటుకు గురికాకుండా జాగ్రత్తగా ఉండండి.



# వేసవిలో తాగడం ఎంతో ముఖ్యం



ప్రతి ఉదయం ఖాళీ పొట్టతో వాము టీ తాగి చూడండి,

బరువు తగ్గడం నుండి డిటాక్స్ వరకు, వేసవి ఉదయాలలో ఖాళీ కడుపుతో అజ్వైన్ టీ అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది.

ప్రాచీన మసాలా దినుసుల్లో వాము ఒకటి. దీన్ని ఆంగ్లంలో అజ్వైన్ అంటారు. వేసవిలో కచ్చితంగా తాగాల్సిన పానీయాలలో ఇదీ ఒకటి. ఉదయాన్నే ఖాళీ పొట్టతో ఒక కప్పు అజ్వైన్ టీ తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది ఆకలిని పెంచుతుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఆయుర్వేదంలో కూడా వామును శక్తివంతమైన క్లెన్సర్‌గా చెబుతారు. వాము తినడం వల్ల ఉబ్బరం, ఎసిడిటీ, మలబద్ధకం వంటివి రాకుండా ఉంటాయి.

**వాము టీ ఎలా చేయాలి?**

ఒక కప్పు వేడి నీటిలో ఒక టీస్పూన్ వాము వేసి మరిగించాలి. అంతే అజ్వైన్ టీని రెడీ అయిపోతుంది. కొన్ని నిమిషాల తరువాత దాన్ని వడకట్టి ఒక కప్పులో పోసి ఉదయన ఖాళీ పొట్టతో తాగాలి. దీనిలో రుచి కోసం తేనె, బ్లాక్ సాల్ట్, నిమ్మరసం వంటివి కలుపుకోవచ్చు. వామును ప్రతిరోజూ తినడం వల్ల ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ఈ మసాలా దినుసు అధిక కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంతో పాటు బ్యాక్టీరియా, ఫంగస్‌లతో పోరాడటానికి సహాయపడుతుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. అజ్వైన్ పెప్టిక్ అల్సర్లను నయం చేస్తుంది. వేసవి కాలంలో ఖాళీ పొట్టతో అజ్వైన్ టీ తాగడం వల్ల కలిగే అద్భుతమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి.

**1. జీర్ణక్రియను పెంచుతుంది**

వాము టీ వ్యక్తుల జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. పొట్ట ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. అజ్వైన్ లోని థైమోల్, ఇతర క్రియాశీల పదార్థాలు, గ్యాస్ట్రిక్ రసాల స్రావాన్ని ప్రేరేపించడంలో సహాయపడతాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అజీర్ణం, అసిడిటీ వంటి లక్షణాల నుండి ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణ సమస్యలు ఉన్న వారికి, భోజనం తర్వాత కడుపు నొప్పి ఉన్నవారికి ఇది గొప్ప ఎంపిక.

**2. ఆకలిని మెరుగుపరుస్తుంది**

అజ్వైన్ టీ ఆకలిని ప్రేరేపిస్తుంది. వేసవి వేడి ఆకలి వేయకుండా అడ్డుకుంటుంది. ఈ టీ తాగడం వల్ల ఆకలి వేస్తుంది. అజ్వైన్ టీ జీర్ణవ్యవస్థను ఉత్తేజపరుస్తుంది. ఇది ఆరోగ్యకరమైన ఆకలిని ప్రోత్సహిస్తుంది.

**3. ఉబ్బరం నుండి ఉపశమనం**

ఉబ్బరం, గ్యాస్ట్రిక్ సమస్యలను వదిలించుకోవడానికి అజ్వైన్ టీ ఉత్తమం. వాములో ఉండే కార్మినేటివ్ లక్షణాలు గ్యాస్, కడుపుబ్బరం వంటివి రాకుండా అడ్డుకుంటాయి.

**4. డిటాక్స్ లో సహాయపడుతుంది**

అజ్వైన్ టీ తాగడం వల్ల అదనపు ప్రయోజనం కూడా కలుగుతుంది..1... అదే డిటాక్సిఫికేషన్. వాము తినడం వల్ల మూత్ర విసర్జన సవ్యంగా జరుగుతుంది. మూత్రవిసర్జన ద్వారా వ్యర్థాలు, ఇతర విషాలను బయటకు తీయడానికి శరీరాన్ని ప్రోత్సహిస్తాయి.

**5. జీవక్రియను పెంచుతుంది**

అజ్వైన్ టీ జీవక్రియను పెంచుతుంది. ఇది బరువు నిర్వహణకు సహాయపడుతుంది. అజ్వైన్ టీ మొత్తం జీవక్రియ ఆరోగ్యాన్ని పెంచుతుంది.

# మూవీభేరి



# టుక్ టుక్.. సరి కొత్త టైటిల్

చిత్రవాహిని, ఆర్ వై జి బ్యానర్లు తమ తాజా చలనచిత్రం టైటిల్ "టుక్ టుక్" టైటిల్ పోస్టర్ ని శ్రీ రామ నవమి సందర్భంగా విడుదల చేశారు. విచిత్రమైన ఆటో ఈ పోస్టర్ లో చాలా ఆకర్షణీయంగా ఉంది. చూడడానికి ఏదో ఫాంటసీ చిత్రాన్ని తలపించేలా పోస్టర్ లుక్ ఉంది. సుప్రీత్ సి కృష్ణ దర్శకత్వం వహించిన, "టుక్ టుక్" ఒక ఆహ్లాదకరమైన సినిమాటిక్ అనుభూతిని అందిచేలా ఉంది, అసలు కథలో ఆ ఆటో పాత్ర ఏంటి అనేది ముందు ముందు యూనిట్ సభ్యులు ఇచ్చే అప్డేట్స్ లో చూసి తెలుసుకోవాలిసి ఉంది. పోస్టర్ లో అంశాలని బట్టి ఈ కథ ఒక గ్రామం నేపథ్యంలో సెట్ చేయబడింది. అనేక ఫాంటసీ ఎలెమెంట్స్ కూడా ఈ పోస్టర్ లో కనిపిస్తున్నాయి. రాహుల్ రెడ్డి, లోక్కు సాయి వరుణ్ మరియు శ్రీరాములు రెడ్డి నిర్మించిన "టుక్ టుక్" క్రియేటివ్ తరహాలో ప్రేక్షకుల మనన్నలు పొందుతుంది. పోస్టర్ లో హీరో నో హీరోయిన్ ఓ కాకుండా ఈ ఆటో పెట్టడం వెనుక ఉన్న కథాంశం ఏంటి అనేది కూడా ప్రేక్షకులు చర్చించుకుంటున్నారు. దీనికి సంతు ఓంకార్ సంగీతం అందించారు మరియు హార్థిక్ శ్రీకుమార్ సినిమాటోగ్రఫీ అందించారు. "టుక్ టుక్" ఒక ఉత్తేజకరమైన సినిమాటిక్ రైడ్గా ఎక్స్పిరియన్స్ చెయ్యడానికి ప్రేక్షకులు సిద్ధంగా ఉన్నట్టు ఈ పోస్టర్ రెస్పాన్స్ బట్టి అర్థమవుతుంది.




# సమంత నయా హెయిర్‌స్టైల్ చూశారా..?

అందం, అభినయంతోపాటు స్టన్నింగ్ యాక్టింగ్‌తో తెలుగు, తమిళం, హిందీ భాషల్లో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకుంది చెన్నై సుందరి సమంత. గతేదాది ఖుషి సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన సామ్.. ప్రస్తుతం బాలీవుడ్ యాక్టర్ వరుణ్ ధవన్‌తో కలిసి సిటడెల్ వెబ్ సిరీస్‌లో నటిస్తోంది. సోషల్ మీడియాలో చురుకుగా ఈ భామ ఎప్పటికపుడు ఏదో ఒక పోస్ట్ పెడుతూ వార్తల్లో నిలుస్తుంటుంది. తాజాగా సామ్ తన హెయిర్‌స్టైల్‌ను మార్చేసుకుంది. కొంత డ్రామాను మీ ముందుకు తీసుకొస్తున్నా.. అనే క్యాప్షన్‌తో సామ్ నయా హెయిర్ స్టైల్ మేకింగ్ వీడియో ఒకటి నెట్టింట హల్‌చల్ చేస్తోంది. మరోవైపు వైట్ షార్ట్ డ్రెస్‌లో కెమెరాకు స్టన్నింగ్ ఫోజులిచ్చింది. ఈ స్టిల్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సమంత కొత్త సినిమాలేమి ప్రకటించలేదు.

# టీచర్.. తెలంగాణ అంకాపూర్ కథ

తెలంగాణలోని అంకాపూర్ అనే గ్రామం నేపథ్య కథతో తెరకెక్కిస్తున్న చిత్రం 'టీచర్'. కలర్స్ స్వాతి, నిఖిల్ దేవాదుల, నిత్యశ్రీ, రాజేంద్రగౌడ్, సిద్ధార్థ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కలర్స్ స్వాతి టీచర్ పాత్రలో కనిపించనుంది. '90స్ఏ మిడిల్ క్లాస్ బయోపిక్' వెబ్‌సిరీస్ ఫేమ్ ఆదిత్యహాసన్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ మేదారం నిర్మాత. దర్శకుడు మాట్లాడుతూ 'చదువు అంతగా రాని ముగ్గురు డల్ స్టూడెంట్స్ కథ ఇది. ఓ టీచర్‌ని కలిసిన తర్వాత వారి జీవితం ఎలా మారిందనేది ఆసక్తికరంగా ఉంటుంది. సరదా సన్నివేశాలు, అందమైన.. అమాయకమైన ప్రేమ, భావోద్వేగాలతో ప్రతి ఒక్కరి హృదయాలను స్పృశిస్తుంది. ఆద్యంతం వినోదంతో మెప్పిస్తుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: అజీమ్ మహమ్మద్, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, రచనదర్శకత్వం: ఆదిత్య హసన్.






# డిసెంబర్‌లో నితిన్ 'రాబిన్‌హుడ్'.. ప్రకటించిన మైత్రీ మూవీ మేకర్స్

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని డిసెంబర్ 20న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

ఇందులో నితిన్ స్పోర్ట్స్ బైక్ మీద కూర్చొని స్టైలిష్‌గా ఉన్నారు. ఈ సినిమాలో నితిన్ దొంగ పాత్రలో కనిపిస్తారని, . హ్యూమరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఆకట్టుకుంటుందని, నితిన్ క్యారెక్టర్ టీజర్‌కు మంచి స్పందన లభించిందని చిత్ర బృందం పేర్కొంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయి శ్రీరామ్, సంగీతం: జీవీ ప్రకాష్‌కుమార్, ఆర్ట్: రామ్‌కుమార్, రచనదర్శకత్వం: వెంకీ కుడుముల.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com